

ఆమధ్య ఉన్నట్టుండి హఠాత్తుగా నేపాల్ బాబా అనే ఆయన ప్రసిద్ధుడయ్యాడు. ఆయన ఎలాంటి రోగాన్నయినా ఇట్టే కుదిర్చేస్తున్నాడని కర్ణాకర్ణిగా విని వేలకొద్దీ జనం ఒరిస్సాలోని రంతలాయ్ గ్రామానికి మూగటం ప్రారంభించారు. ఆయన వచ్చినవాళ్ళందరికీ 'సర్వ రోగనివారిణి' అనే పేరుతో ఏదో చెట్టు బెరడును ఇవ్వటం మొదలెట్టాడు. దానివల్ల ఒక్క జబ్బయినా నయమైనట్టు దాఖలాలు లేవు కాని మరే కారణంవల్లనో మొదట్లో ఎవరికి జబ్బో కుదిరివుంటుందనీ, దాన్ని నేపాల్ బాబా మహిమగా ప్రజలు వసంతులు పాకించివుంటారనీ మనం నిస్సందేహంగా ఆరోపించవచ్చు.

* * *

భారతదేశం ఆధ్యాత్మికభూమి అని బహుకాలంగా ఒక వాదం ప్రచారంలో వుంది. ఈవిషయంమీద భారతీయులకే నమ్మకం సన్నగిల్లుతున్న రోజుల్లో తెల్లవాళ్లు వచ్చి దానికి మళ్లీ జీవంపోశారు. విదేశీయుల్లో బాగా మేధావులైనవాళ్లుకూడా 'వేదాలు' ఉపనిషత్తులు, బూజుపట్టిన ఇతర పాత సాహిత్యం తిరగేసి ఈవాదం నిజమే నన్నారు. మనదేశంలోని భౌతికసంపదనంతా దోచుకుపోతూ "ప్రపంచానికి ఇండియా ఇవ్వవలసిం దేమన్నా వుంటే అది ఆధ్యాత్మికసందేశమొక్కటే" నని బాజా వాయించారు. కామమ్మ మొగుడంటే కామోసుననుకున్నట్టు మనవాళ్లు ఈ వాదాన్ని నమ్మేశారు.

మతవిశ్వాసానికి మానవుడిలోని భయమే ఆధారం. అనాగరికదశలో వున్నప్పుడు మనిషి ప్రకృతిశక్తుల్ని చూసి భయపడి మానసికంగా తను లొంగిపోతే అవి తమ్మ కరుణిస్తాయనీ, మంత్రాలచేతా, తంత్రాలచేతా వాటిని వశపరుచుకోవచ్చనీ నమ్మాడు. కాని మానవుడి ఇచ్ఛాశక్తి లేకుండానే జీవితపు అవసరాలవల్ల నాగరికత పెరిగింది. నాగరికత పెరిగి పదార్థవిజ్ఞానం ఎక్కువైనకొద్దీ ప్రకృతి వెనకగల దైవత్వంమీద నమ్మకం తగ్గిపోతున్నది.

* * *

భారతదేశంలో నూటికి 99 మంది దేవుణ్ణి గాఢంగా విశ్వసించటంవల్ల మనదేశానికి ఆధ్యాత్మికభూమి అనే 'అపవాదు' వచ్చింది. మన ఆధ్యాత్మికవాదుల్లో చాలా రకాలవారు వున్నారు.

భగవాన్ రమణమహర్షివలె "నిను రనువ్వు తెలుసుకోవటమే జీవితానికి ప్ర

(46-వ పేజీ చూడండి)

# నేపాల్ బాబా

(8-వ పేజీ తరువాయి)

మార్గం. జీవితంలో వుంటూ దానికి అతీతుడవైతేనే నీకు శాశ్వతానందం లభిస్తుంది” అని చెప్పేవాళ్లొకరకం. అరవిందయోగి వలె “సకలజీవరాశి పరిణామం చెందుతున్నది. మానవుడితో ఈ పరిణామక్రమం ఆగిపోలేదు. అధిమానవత్వాన్ని సంపాదించటమే మనకర్తవ్యం. ఆ దివ్యశక్తి నీలోకి అవతరించటానికి నువ్వు సంసిద్ధంగా వుండు.” అని చెప్పేవాళ్లొకరకం.

కాని జనాభాలో ఎక్కువభాగానికి యీమాటలు అర్థంకావు. వాళ్ళ జీవితమంతా దైనికావసరాలని ఎదుర్కోటంతోనే సరిపోతుంది. తమ ఆర్థికదారిద్ర్యాన్నుంచి తప్పించుకోనటానికి ఆధ్యాత్మిక సంపదని సంపాదించటమే మార్గమని నమ్మేస్తారు. అందుచేతే మనదేశంలో సన్యాసులంటే ఇంత వేలంవెర్రి. ఉద్యోగం దొరికితే ఆంజనేయస్వామికి కొబ్బరికాయలు కొడతామని మొక్కుకునేవాళ్ల సంఖ్య ఎక్కువగా కనిపించటానికి కూడా ఇదే కారణం.

ఈ సందర్భంలోనే ముమ్మిడివరంబాలయోగి, నేపాల్ బాబా రంగంలోకి అవతరిస్తారు. వీరివద్ద అలౌకికశక్తులున్నాయని విశ్వసించేవాళ్ళలో ఎక్కువమంది బీదవాళ్లే. మన ఆర్థిక హీనస్థితి కారణంగా దేశంలో క్షయ, కుష్టు మొదలైన భయంకర రోగాలు వ్యాప్తిలో వున్నాయి. వీటిని నిర్మూలించటానికి తగిన వైద్య సౌకర్యాలు మనకి లేవు. కొద్దిగాఉన్నా అవి ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉండవు. కనక “ఫలానాచోట ఫలానా యోగి వున్నాడట. ఆయన ఏ రోగాన్నయినా కుదిర్చేస్తాడట.” అని చెవినిబడితే అక్కడికి జనం వేలకొద్దీ మూగడంలో ఆశ్చర్యంలేదు.

అయితే యీ యోగులచుట్టూ ధనికులు కూడా తరుచు చేరటం గమనిస్తాం. వాళ్లని గట్టిగా పరీక్షించి చూస్తే బ్లాక్ మార్కెట్‌లాంటి నేరాలు చేస్తూ లోపల బాధపడేవాళ్లు కొందరుంటారు. ఆ యోగులమీద జవాని కున్న వ్యామోహాన్నుంచి సొమ్ముచేసుకోదలిచేవాళ్లు మరికొందరుంటారు. పాలకవర్గంలోవాళ్ళు, పోలీసులు కూడా మనకి ఆ ప్రాంతాల్లో ఎదురుగా కనిపిస్తారు. ప్రజల్లో భగవద్భక్తిని ప్రోత్సహించటం వాళ్లకి లాభకరం. ఎందుకంటే అది ప్రజలసందేహాలని, విమర్శనాశక్తిని నిద్రబుచ్చుతుంది.

నేపాల్‌బాబా పదమూడేళ్ళ పసివాడు కావటం అతనిలోని ఆకర్షణకు మరో కారణం. వయస్సుమీరిన కపట సన్యాసులైతే లోకాన్ని తమవైపు కాకర్షించటానికి సొంతంగానే ప్రయత్నించగలరు. కాని ఇంత కుర్రవాడుగా, అమాయికంగా కనిపిస్తున్న గొల్లబాలుడిలో అలౌకికశక్తులున్నాయని భ్రమించటానికి ఆట్టేసేపు పట్టదు.

ఈ విషయాన్ని మొదటగా ప్రచారం చేసిందెవరో చెప్పటానికి మనకి ఆధారాలు లేవు. కాని ఎవరో పెద్దవాళ్లే అతని వెనకవుండి వ్యాపారం సాగిస్తూ వుండిఉండచ్చు.

ఏది ఏమైనా ప్రజలు నేపాలీబాబా దగ్గిరికి వేలకొలదిగా చేరారు. ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహార్, ఆంధ్ర మొదలైన అన్ని ప్రాంతాలనుంచి జనం వెళ్లారు. ఇంతమంది ఒక్కసారిగా ఆ గ్రామంమీద పడేటప్పటికి అవసరవస్తువుల కొరత ఏర్పడింది. ఇదే సమయమని బాబాని ఆశ్రయించుకునివున్న వర్తకులు ధరలు పెంచేశారు. నాలుగునెల్లకు పైగా యీ తంతు జరుగుతున్నది. ఆహారపదార్థాల కొరతవల్ల, ధరలు పెరిగిపోవటంవల్ల జనం ఏది పడితే అది తినటం ప్రారంభించారు. పురుగులు పట్టిన అన్నమైనా, కుళ్లిన కాయగూరలైనా ఆకులు అలములు, ఏది దొరికితే అది తినేశారు గత్యంతరం లేక.

పైగా అక్కడికి చేరినవాళ్లు ఎక్కువగా రోగులు కావటంవల్ల ఒకళ్ళ రోగాలు ఒకళ్ళకి అంటుకున్నాయి. దుష్టమైన ఆహారం తింటే త్వరగా తగిలే జబ్బు కలరాయే. వెంటనే కలరా వ్యాపించింది. కొందరు ఉన్నచోటనుంచే ఈశ్వరుడిసన్నిధికి చేరుకున్నారు. కొందరు స్వస్థలాలకు తిరిగిపోతూ దోవలో అస్వస్థులై స్వర్గస్థులయ్యారు. మరికొందరు ఇళ్లకు చేరుకున్న తరువాత తమ కలరా ఇతర్లకి కూడా అంటించేదాకా మరణించలేదు. అందుచేత ఆచుట్టుపక్కల రాష్ట్రాలలో కలరా బాగా వ్యాప్తిలో వున్నట్టు వార్తలు తెలుపుతున్నాయి. మొత్తానికి కల్లా లేదన్నా వివిధప్రదేశాల్లో 1500 మంది దాకా కలరావల్ల మరణించారని ధ్రువపడని అంచనాలు చెబుతున్నాయి. ఆ ప్రాంతంలో పర్యటించిన పి. టి. ఐ. వార్తావిలేఖరి రెండుమూడురోజుల్లో 500 మంది దాకా ఎక్కడపడితే అక్కడే టపటప కాకుల్లా రాలిపోయారని చెబుతున్నాడు.

నేపాల్‌బాబా ఇచ్చే మందులో ఔషధగుణమే లేదని కలకత్తాలో వైద్యులు దాన్ని పరీక్షచేసి తేల్చారు. ప్రఖ్యాతశాస్త్రజ్ఞులు సి. వి. రామన్ గారుకూడా ఈమాటే అన్నారు. అయినా కలరా బాగా వ్యాపించేదాకా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఆ తరవాత చాలా కట్టు దిట్టాలు చేశారు.

కలరావైద్యుల్ని చాలమందిని రంతలాయ్ ప్రాంతానికి పంపి కొన్ని తాత్కాలిక వైద్యశాలలు ఏర్పాటుచేశారు. ప్రతివాళ్ళకీ ఇంజక్షను లిచ్చి నివారణచర్యలు తీసుకున్నారు. రంతలాయ్‌దిశగా కొత్తగా వెళ్ళేవాళ్ళని ఆపుచేశారు. అక్కడ చేరిన యాత్రికులని త్వరత్వరగా స్వస్థలాలకి చేర్చివేశారు. ఇప్పుడు పరిస్థితి అదుపులోనే వున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

కాని ఒక గుడ్డి కుర్రవాడు, వాడి తమ్ముడైన ఒక మూగవాడు మాత్రం ఇంకా రంతలాయ్‌లోనే మిగిలిపోయారు.

గుడ్డివానిని మూగవాడు నేపాల్‌బాబా దగ్గిరికి తీసుకువెళ్లాడు.

గుడ్డి—మా అయ్యెక్కడుండాడు బాబా!

బాబా—మీ అయ్య చచ్చిపోయాడు.

గుడ్డి—అయ్యో! సచ్చిపోయాడా? ఇంక మా గతేంది దేముడా! (అన్నదమ్ములిద్దరూ ఏడుస్తారు)

బాబా—ఏడవకండి. మీ అయ్య చచ్చిపోలేదు. భగవంతుడిలో ఐక్యమయిపోయాడు.

గుడ్డి—ఏం బగమంతుడో బాబా! మీరిచ్చిన మందు పనిసెయ్యనేలేదండి. నాకు సూపూ రాలేదు. ఈడికి మాటా రాలేదు.

బాబా—మీ కర్మ ఇంకా పరిపక్వం కాలేదు. దానికి నేనేం చేస్తాను? దేవుణ్ణి స్మరించుకొంటూవుండండి. అందుకు మాటా చూపూ అక్కర్లేదు.

గుడ్డి—కడుపులో కాల్తావుందండి! దేముణ్ణి తలుచుకుంటే కూడెడతాడా బాబా? ఈడ మమ్మల్నెవరు కనిక్కరిస్తారు? మీరేదో మందిచ్చి రచ్చిస్తారని వొచ్చినాం. ఇప్పుడీడ బొయ్యేది మేం?

ఈలోగా పోలీసులువచ్చి బాబాయింటిని చుట్టుముట్టారు. ఆయనఇంటి తాళానికి “సర్వరోగనివారిణి”ని వశపర్చుకున్నారు. గుడ్డివాణ్ణి, మూగవాణ్ణి బయటికి పంపించారు. ఇప్పుడెవ్వరినీ బాబాదర్శనానికి రానివ్వటంలేదని వార్త.

ఆ గుడ్డి, మూగ అన్నదమ్ములు రంతలాయ్‌కి చేరిన యాత్రికులందరికీ ప్రతినిధులు.

—(ఎన్నార్.)